# జయజయ జయహే

ఒకప్పుడు పురుషోత్తంరెడ్డి జర్నలిస్టుగాను, రాజప్ప కార్మిక నాయకుడిగాను, ఖైరుద్దీన్ అన్సారి పుస్తకాల షాపు యజమానిగాను, బుచ్చిరాజు ఎమ్మెస్సీ చదువుతూను, ఛమేలీ ముఖర్జీ ఇంగ్లీషు లెక్చరర్ గానూ వుంటుండేవారు. కానీ వాళ్ళు సామాజిక వ్యతిరేక కార్యకలాపాలు చేసినందుకు, సంఘవ్యతిరేక శక్తులతో కలిసి పనిచేస్తున్నందుకు, సంఘభద్రతకు ఆటంకం కలుగచేసినందుకు, రాజద్రోహం చేసినందుకు వాళ్ళని పోలీసులు అరెస్టు చేశారు. జైల్లో పడేశారు. విచారణ లేదు. వాళ్ల విడుదల ఎప్పుడో వాళ్ళకే తెలియదు.

గోడలు ఎత్తుగ్గా వున్నాయి. ఎత్తుగా వున్న గోడల మీద ఇనుప తీగలు పైనున్నాయి. అక్కడక్కడ పెద్ద పెద్ద ఫ్లడ్ లైట్లున్నాయి. ఆ గోడ దాదాపు అరమైలు పొడవుంది. ఆ గోడకు ఆ చివరన ఒక సెంట్రీ నిలబడి వున్నాడు. అతని చేతిలో తళతళ మెరిసే కత్తి చివరగాగల తుపాకీ వుంది. అతని నెత్తిమీద సిమెంటు రంగులో వున్న ఇనుప టోపీ వుంది. అతను మడతలు నలగని ఖాకీదుస్తులు వేసుకుని దర్జాగా హుందాగా పెద్ద పెద్ద మీసాల్తో భీకరంగా వున్నాడు.

అతనికి కుడి పక్కగా విశాలమైన మట్టి దారి ఫర్లాంగు దూరం వ్యాపించి వుంది. ఆ రోడ్డుకి ఇరువైపులా తురాయి చెట్లు పూలుపూసి మెరుస్తున్నాయి. ఆచెట్లకి మధ్యమధ్యన రకరకాలుగా పెంచిన క్రోటన్సు మొక్కలు అందంగా వున్నాయి. ఆ చివర గోడపక్కన వరసలు యెక్కువగా వున్నాయి. మిగతా ఖాళీ ప్రదేశమంతా రకరకాలైన పూల మొక్కలతోనూ కూరగాయల మొక్కలతోనూ నిండిపోయి వున్నది.

తర్వాత విశాలమైన వరండా, కొన్ని గదులు, బైటచిన్న వరండా, పెచ్చులూడిపోయిన స్తంభాలు, వరుసగా పాతిక గదులు దాటాక మలుపు. అక్కడ పట్టపగలే చీకటి. ఆ చీకటి దాటితే ఎడంవేపున కిందికిమెట్లు, ఆ మెట్లు దిగి పక్కకువెళితే తక్కువ ప్రదేశంలో కట్టిన ఎక్కువ ఖైదీల గదులు. అవి ఆడ ఖైదీలగదులు... అవేకాక అక్కడక్కడా విడివిడిగా ఎవరి గదుల చివర వారికి పదేసి పాయిఖానాలున్నాయి.

★ ★ ★

పురుషోత్తంకి ఆ రోజు సెలవు రోజు. అంచేత తన ఇంట్లోనే వున్నాడు. అప్పుడు భార్య వచ్చి కాఫీ గ్లాసు చేతిలో పెట్టి వెళ్ళింది. కాఫీ తాగుతూ సిగరెట్ తీసి వెలిగించాడు.

ఆ సమయంలో ఒక ముసలాయన "బాబూ పురుషోత్తం బాబు ఇల్లిదేనా?" అని వచ్చాడు. ఆయనకు దాదాపు ఏభై ఏళ్ళుంటాయి. భుజమ్మీది కండువాతో నుదుట్ని తుడుచుకుంటూ......

"మీ ఆఫీసు కెళ్లాను బాబూ, మీరు లేరు, ఇల్లుకనుక్కోడం మా పెద్ద ఇబ్బందైపోయింది." కూర్చుంటూ "నీకో విషయం చెప్పాలి బాబూ. మాకు నీ ద్వారానే న్యాయం జరుగుద్దని నమ్మతున్నాను." అని ఉపక్రమించేడు.

"చెప్పండి.."

"నాపేరు రామస్వామి. మాది మాలపేట. దానికే ఇపుడు ప్రియదర్శినీ నగరం అని పేరు మార్చామనుకో. ఆ మాల పేటలో ఒక వందిళ్ళుంటాయి. అయ్యి ఈనాటివి గాదుబాబూ, తాతల్నాటి నుంచీ వస్తున్నవే. మా సొంతిల్లులే అని మేవనుకుంటున్నవే. కానీ ఆ మద్దెన మీకిళ్ళు కట్టిస్తావని చెప్పి దొరోరు, ఆ ఇళ్ళు ఖాళీ సేయింపించారు. మేం పక్కా ఇళ్ళొస్తాయని ఊరికవతలకి పోనాం. ఆర్నెల్లయింది. సంవత్సరమైంది. ఇళ్ళూలేవు. వాకిళ్ళూ లేవు. ఆ మద్దెన వారం కిందట మా భూవులు మీద పెద్ద హోటేలు కడ్తున్నట్టుగా విన్నాం. ఆ కాంట్రాక్టరు బాబు దగ్గరకెళ్ళాం. ఏవి బాబు... ఏవిటి... మాయ అని అడిగేం. గవర్నమెంటోళ్ళు ఆ భూవి తనకిచ్చేరని... చెప్పేడు. కలక్టేరు బాబుతో కల్సి మనవి చేసుకున్నాం. సూస్తానన్నాడు. కానీ ఈ లోపల ఆ కాంట్రాక్టరు పునాదులు లేపేస్తున్నాడు. మా కార్పొరేటరు బాబు దగ్గరికెళ్తే ఇదిగో అంటున్నాడు అదిగో అంటున్నాడు. ఈ విషయం మీకు సెబుదామని... అదీ బాబూ కత... మీ పేపర్లో ఎయిద్దూ.."

అలాగేనని పురుషోత్తం, రామస్వామి చెప్పిన వివరాలను రాసుకుని ఆయన్ని పంపించేశాడు. ఆ వార్తను మర్నాటి పత్రికలో ప్రచురించేడు.

అప్పుడు అసలు గొడవ మొదలైంది. ఆ కాంట్రాక్టరు వెనక ఎన్నెన్ని శక్తులు ఉన్నాయో అన్ని శక్తులూ పురుషోత్తం మీద పడ్డాయి. పలుకుబడి చేత ... డబ్బుచేత... ఆడవాళ్లచేత... అతన్ని లొంగదీసుకోడానికి చూశారు. కానీ పురుషోత్తం, విధానమ్మీద లంచగొండి అధికారుల మీద వివరాలు విపులంగా సేకరించి వ్యాసాలు రాశాడు. ఒకరోజు ఆకస్మాత్తుగా ఒక సబిన్స్పెక్టరు, ముగ్గురు కానిస్టేబుల్స్ వచ్చి అతన్ని అరెస్టు చేస్తున్నామని చెప్పేరు.

"ఎందుకు...ఏమిటి?"

ఆ ప్రశ్నలకు సమాధానాలివ్వవలసిన అవసరం పోలీసు వాళ్ళకి లేదట. వాళ్ళు తెచ్చిన వారెంటు వెనుక ఎందరి హస్తాలున్నాయెూ అతనూహించుకోగలిగేడు. కానీ పురుషోత్తం జంకకుండా పోలీసు ఠాణాకెళ్ళాడు. అక్కణ్నుంచి ఖైదుకి తీసుకు వెళ్ళారు. పదిహేను రోజులైంది. నెలరోజులు గడిచాయి, రెండు నెలలు, కారణం లేని కారాగారం.

సరిగ్గా అదే సమయంలో పురుషోత్తం వచ్చినట్లుగానే వచ్చేడు బుచ్చిరాజు: బుచ్చిరాజు కష్టపడి యూనివర్శిటీ చదువు వరకూ వచ్చేడు. అతను కష్టం విలువను అనుభవం ద్వారా తెలుసుకున్నాడు. అతను యూనివర్శిటీలో వుండే ఒక విద్యార్థి యూనియన్‌ని చాలా చైతన్యవంతంగా నడిపేవాడు. ఎక్కడైనా ఏ విద్యార్థికైనా అన్యాయం జరిగితే అక్కడ తోటి సోదరులతో ప్రత్యక్షమై జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడేవాడు. స్వార్థంలేని నిర్భయం, పుస్తకాలు చదివి ఏర్పరచుకున్న స్వచ్ఛమయిన అభిప్రాయాలు అతన్ని విలువైన వ్యక్తిగా నిలబెట్టేయి. దానికి ఫలితం - అతను అరెస్టు చేయబడ్డాడు. తప్పుడు కేసులతో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచి రిమాండ్‌లోకి పంపేరు. రాజప్ప అంతే. ఖైరుద్దీన్ అన్సారీ అంతే. ఛమేలీ ముఖర్జీ అంతే.

న్యాయ చట్టంలో నిర్దిష్టమైన విధానం వుంది. కానీ న్యాయాన్ని అమలుజరిపే అధికారులకు ఆ విషయం అక్కర్లేదు. వాళ్ళని జైల్లో పడేశాక అధికారులు వీళ్ళ విషయం సహజంగా అలక్ష్యం చేశారు. వీళ్ళవాళ్ళు ఎన్ని ఉత్తరాలు రాసినా వీళ్ళకి ఆ ఉత్తరాలు అందలేదు. ఏవిటౌతుందో తెలీదు. వీళ్ళగురించి పట్టించుకునేవాడు లేడు.

మర్నాడు మామూలుగా తెల్లవారింది.

పదిగంటలవుతుంది.

అన్సారీ మర్రిచెట్టు కింద కూర్చున్నాడు. ఇంతట్లో ఒక పారిశుద్ధ్య కార్మికుని చేత ఒక వార్డర్ ఎర్రటి గుడ్డలు, వాటి మీద కప్పబడిన తెల్లటి గుడ్డలతో నింపివున్న గంపని పట్టించుకుని వెళుతున్నాడు.

ఆ వార్డర్ అట్నించిటు వస్తున్నపుడు "ఏవిటని" అడిగేడు అన్సారీ.

"ఏవీ లేదు. రాత్రి ఓ ఆడఖైదీ ప్రసవించింది. పురుట్లోనే కునికీసేడు గుంటడు. పారీసేం" అన్నాడు.

"పారీసేరా...!" ఆశ్చర్యపోయాడు అన్సారీ. అతనికొకసారి తన భార్య జ్ఞాపకానికొచ్చింది.

ముంతాజ్!

ముంతాజ్!!

ఆరోజు తను గదిలో కూర్చుని ఎకౌంట్స్ చూసుకుంటున్నాడు. అంతట్లో తలుపు చప్పుడైంది.. భార్య వెళ్ళి తలుపు తీసింది. వరసగా ఏడుగురు పోలీసులు... గబగబా ఇంట్లోకి వచ్చేరు... అడ్డదిడ్డంగా సామాన్లన్నీ విసిరేశారు... ఏవిటని అడుగబోయేడతను. అడుగనివ్వలేదు. లాఠీలతో బాదేరు. అడ్డుగా వచ్చింది భార్య. ఒక పోలీసు తన బూటుతో ఆమె పొట్టమీద తన్నాడు.

ముంతాజ్ గర్భవతి.

తన ఎదురుగానే తన భార్య విలవిల్లాడింది. కానీ తను కదలడానికి వీల్లేకపోయింది. తన గుండెల మీద పోలీసు బూట్లు, తనని కదలనీయకుండా పోలీసుల ఉక్కు చేతులు. తనని బరబరా లాక్కుని బైటకుతీసుకువచ్చేరు. అప్పుడు గదిలోకి తను చూశాడు.

గది మధ్యలో పడిపోయిన ముంతాజ్ చిరిగిపోయిన గర్భం. లంగా, చీర తడిసిపోయి నేలమీద చారికలు కట్టిన రక్తం.

ముంతాజ్ జ్ఞాపకానికి రాగానే అన్సారీ ఒక్కసారి అయోమయంగా అయిపోయాడు. పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు. గట్టిగా అరిచేడు. ఆ అరుపుకి పురుషోత్తం, రాజప్ప, బుచ్చిరాజు, మరికొంతమంది ఖైదీలు అతని చుట్టూ చేరారు.

"ఈ పోలీసు బాద్మాష్‌ని బ్రతకనివ్వకూడదు... వీళ్ళు... తల్లికి మొగుళ్ళు. పుండాకోర్లు.... దయాదాక్షిణ్యం మమకారంలేని రాక్షస వెధవలు.." గట్టిగా

తిట్టి, ఇంతట్లో అటుగా కర్రూపుకుంటూ వస్తున్న ఒక కాపలా జవాన్ని పట్టుకుని, వాడి టోపీ విసిరేసి, వాడ లాఠీకర్ర లాక్కుని, వాడ్ని చొక్కా పుచ్చుకులాగి విసిరికొట్టి, నేలమీద పడ్డవాడ్ని లేపి చితకతన్నేడు అన్సారీ.

అన్సారీని ఆపబోయారు మిగతా ఖైదీలు. కానీ అన్సారీ ముఖంలో కోపానికి కారణం వాళ్ళకు తెలీలేదు. అన్సారీ ముఖం పీర్ల గుండంలా వుంది. అతని కళ్ళు గుండంలోని నిప్పుకణికల్లా వున్నాయి. గబుక్కున మిగతా పోలీసులు వచ్చారు. గబగబా వాళ్ళు లాఠీలందుకున్నారు. వీళ్ళు రాళ్ళందుకున్నారు. దొరికిన ఖైదీల్ని మంచీ చెడ్డా చూడకుండా విచక్షణా రహితంగా కొట్టేరు. వాళ్ళు కొట్టిన దెబ్బలకు చాలా మందికి ముడుకులు విరిగి పోయినట్టయ్యాయి. అక్కడ మనుషులు మనుషులు దెబ్బలాడుకుంటున్నట్లుగాకాక అడవిలోని జంతువులు ఆకలితో మనుషుల్ని ఏకీలుకాకీలు పీకి తింటున్నట్లుగా వుంది.

ఒక అరగంట గడిచింది.

ఆ వాతావరణం చల్లబడింది. అక్కడక్కడ రక్తంమరకలు మర్రిచెట్టు చపటా అంచునా, క్రోటన్సు కుండీల మీదా, వరండా స్తంభానికి గుర్తులుగా నిలిచాయి.

పురుషోత్తం, రాజప్ప, అన్సారీ, బుచ్చిరాజుల్ని లాక్కొచ్చి గదిలో పడేశారు. మిగతా ఖైదీల్ని గదుల్లో పెట్టి తాళం వేశారు.

"ఎందుకలా తొందరపడ్డావు" రాజప్ప అడిగేడు అన్సారీని. అన్సారీ మాట్లాడలేదు. గది కిటికీ లోంచి కనబడే పిడికెడు ఆకాశాన్ని ఆప్యాయంగా చూస్తున్నాడు. అతని శరీరం అలసి పోయినా అతని మనసు ప్రశాంతంగా ఉంది. అతని కళ్ళు కోపంతో ఎరుపెక్కినా కనుపాపల్లో మాత్రం చిరువెలుగు చల్లగా ఉంది. అలా నీలపు ఆకాశాన్ని చూస్తున్న అతనికి కిటికీ చువ్వల మీద రెండు పిచుకలు కనిపించాయి. వాటిని చూస్తుంటే ఎందుకో సరదా వేసింది. వెంటనే చప్పట్లు కొట్టాడు. అతని వేపు ఆశ్చర్యంగా చూశారు మిగతా ముగ్గురు.

సరిగ్గా ఆ సమయంలో వచ్చాడు జైలు అధికారుల్లో ఒకడు. అతడు పెద్ద అధికారికంటే చిన్నివాడైనా ఖైదీల్ని ఖైదీలుగా చూడడంలో నేర్పరిగా చిన్న వయసులోనే ప్రశంసించబడ్డాడు. దానికి కొన్ని గౌరవాలు కూడా పొందాడు. ఆ కుర్ర డిప్యూటీ సూపరింటెండెంటు పొడవుగా వుంటాడు. అతను ఎర్రని

పండులా వుంటాడు. అతని చేతిలో ఎప్పుడూ లాఠీకర్ర వుంటుంది. అతనెప్పుడూ రోత్‌మెన్స్ ఇంపోర్టెడ్ సిగరెట్లు కాల్చడంలో ఆనందాన్ని ప్రకటిస్తాడు. అతనికి 'జిన్' అంటే ఇష్టం. ఆడవాళ్ళన్నా కూడా ఇష్టమే. అతనికి ఆడవాళ్ళలో మొగుడున్న ఆడవాళ్లతో గడపడం అంటే మరీ ఇష్టం. మరి కాలేజీ అమ్మాయిల్తో పడుకోవడం అంటే సరదా. ఇలాగ అతనికి చాలా ఇష్టాలు, ఇష్టం లేకపోవడాలు ఉన్నాయి. ఇష్టం లేకపోవడంలో కొన్నున్నాయి. అవి తనమీద ఎవడైనా ఎదురుతిరగడం.

అంచేత అలాంటి డిప్యూటీ సూపరింటెండెంట్‌కి జైలులో ఈ గొడవ తెల్సి విజిట్ చెయ్యడానికి బైల్దేరాడు. ఆయన వెనకాల జైలు డాక్టరు, సీనియర్ జైలరు, డిప్యూటీ జైలరు, ఛీఫ్ హెడ్ వార్డర్, కొంతమంది సెంట్రీలున్నారు.

ఐదో గది ముందు ఆగాడు.

"తలుపు తెరు" వార్డర్‌ని ఆజ్ఞాపించేడు. వార్డర్ వినయంగా తలుపు తెరిచి ఇటు తిరిగి భక్తితో సెల్యూట్ చేశాడు.

"ఇందులో ఎంతమంది వుంటున్నారు."

డ్యూటీలో వున్న హెడ్ వార్డర్ జవాబు చెప్పాడు.

పురుషోత్తం, రాజప్ప, బుచ్చిరాజు, అన్సారీలను నలుగురు కాపలా జవాన్లు బయటకు తీసుకొచ్చారు.

'వీళ్ళపొగరు నాకు తెలుసు....' అన్నట్లుగా వాళ్ళవేపు కళ్ళు చిట్లించుకుని ఒకసారి చూసి "వాళ్ళు ముగ్గుర్నీ సెల్లో పడేయండి... వీణ్ణి నాతో తీసుకురండి..." అని ఆజ్ఞాపించాడాయన. ఆ ఆజ్ఞను అమలు జరిపి, ఖైరుద్దీన్ అన్సారీని ఆయన వెనుకే తీసికెళ్ళారు.

ఖైదీ గదులు దాటాక వరండాకి కొంచెం దూరంలో ఒక ఆఫీసురూం ఉంది. అందులో గుమస్తావుంటాడు. ఆ గుమాస్తా ఆఫీసర్ని చూసి గాభరాతో లేచి గబుక్కున సెల్యూట్ కొట్టాడు.

ఆ గదిలో ఒక టేబిలు వుంది. ఆ టేబుల్‌కి ఆనుకుని ఒక కుర్చీ ఉంది. ఆ మూల ఏవో ఆయిలు డబ్బాలు ఉన్నాయి. ఇంకోపక్క కర్రలున్నాయి. మరోపక్క కొన్ని పలుగులూ పారలున్నాయి. తలుపుల్లేని బీరువాలో కొన్ని పాత పుస్తకాలున్నాయి.

అన్సారీని ఆ గదిలోకి తీసుకొచ్చి జవానులు బయటకెళ్ళిపోయారు.

అన్సారీ ఓకసారి ఆ ఆఫీసరు వేపు చూశాడు. ఆ చూపులు ఆ ఆఫీసరూ చూశాడు.

"నా హయాంలో నా సెంట్రీ మీద చెయ్యి చేసుకోడానికి నీకెన్ని గుండెలురా'' అన్సారీ మాట్లాడలేదు.

"నిన్నిపుడు తంతే... నీకెవడురా దిక్కు... నిన్ను చంపి... ఇక్కడ పాతి పెట్టేసినా ఎవడూ అడగడు... తెల్సా... ఆఖరికి ... నీ అల్లా కూడా...''

అన్సారీ మాట్లాడలేదు.

"ఓరి... ఎర్రినా కొడక... మంత్రాలు చదువుతున్నావేంట్రా, లేక పొగరా...''

ఆ అధికారి చేతిలోని లాఠీ విసురుగా లేచింది.

అన్సారీ అడ్డుకున్నాడు.

"బోసడికే... కుత్తే... సువ్వర్...'' ఆవేశంగా తిట్టాడు అన్సారీ.

ఆ అధికారి విసురుగా కుర్చీమీద ఎడంకాలుని కిందపెట్టి కుడికాలుని పైకెత్తి అన్సారీ రెండు తొడల మధ్యన తన్నాడు. అన్సారీ చేత్తో అడ్డుకోబోయాడు కానీ అతని కాలి బూట్ల ఇనుప మేకులు అన్సారీ చేతిని దిగబడిపోయి అతని చేతిలోంచి రక్తం చివ్వుమని పైకొచ్చింది. ఆ రక్తం ఆ అధికారి ముఖం మీదకు త్రుళ్ళింది. మళ్లీ రెండోసారి తన్నబోయాడు. అన్సారీ చెయ్యడ్డుకుని అతని లాఠీ కర్ర లాక్కుని ఆ ఆఫీసర్ని కొట్టాడు. ఆ దెబ్బకి కుర్ర ఆఫీసరు విసురుగా గదిలో ఒక మూల పడిపోయి, వెంటనే లేచి చేతికి దొరికిన కర్ర పేడుతో కొట్టాడు. కొంతసేపు పోయాక అలసిపోయాడు. తిరగబడడానికి అన్సారీ చేతినుండి విపరీతంగా చిమ్ముకొస్తున్న రక్తంతో సలుపుపెడుతున్న తొడ మధ్య భాగం వలన అతడు ఆ ఆఫీసరు కొట్టిన దెబ్బల్ని భరించాడు.

అన్సారీ వీపంతా రక్తమయమైపోయింది. అతను అరచి సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే ఆ ఆఫీసరు గది బయటకు వచ్చాడు. డాక్టరులోనికెళ్ళి తణీకి చేసి ఏం ఫర్వాలేదు అన్నట్టుగా చూశాడు. "వీణ్ణి ఆ లెట్రిన్ల తర్వాత వున్న గదిలో పడేయండి''. కేకేసినట్టుగా చెప్పి వెళ్ళిపోయాడు ఆ అధికారి. అతని వెనకాతల అతని మందీ మార్బలం వెళ్ళిపోయారు. చాలా సేపు ఆ గదినుంచి బాధతో అరుపులు వినబడి అటు తర్వాత అక్కడ నిశ్శబ్దం ఆక్రమించింది.

రాత్రి ఆడవాళ్ళ గదినుంచి కేకలు వినబడ్డాయి. ఒకావిడ చాలా బాధతో ఏడ్చింది. ఇంకో ఆవిడ ఆమెను ఓదారుస్తూ ఏడుస్తోంది.

రాజప్ప, పురుషోత్తం మాట్లాడుకుంటూ, ఏవిటో చెప్పబోతూ ఆగిపోయి రాజప్ప చూస్తున్న వేపు కళ్లద్దాలు సరిచేసుకుని చూశాడు పురుషోత్తం.

ఒక నిచ్చెన మీద ఒక శవాన్ని తీసికెళ్తున్నారు. ఆ వెనక ఒకావిడ నిలబడి ఆ శవం వెళ్తున్న వేపు చూస్తోంది.

శవం తతంగం అంతా అయిపోయాక అధికారులందరూ లోనికి వస్తున్నప్పుడు రాజప్ప అంటున్న మాటలు కుర్ర అధికారి విన్నాడు.

"ఈ డాక్టరు నాకొడుకూ... ఏమీ పట్టించుకోని ఆ సూపర్‌నెంట్ గాడూ ఖైదీల్ని బాధపెట్టడం తప్ప ఖైదీలు పడ్డ బాధలు అక్కర్లేదు. వీళ్ళ నిర్లక్ష్యం వలనే ఆవిడ చనిపోయింది. పాపం ఈ పదిరోజులూ ఆ పక్క ఖైదీ చూసినంతైనా ఆ మేట్రిన్ కానీ, వీళ్ళుగానీ చూడలేదు. వీళ్లని అడిగేవాళ్లు ఎవరూ లేరు. ఇవాళ ఆవిడ, రేపు మనం" ఆవేశంతోనూ ఉక్రోశంతోనూ అంటున్నాడు రాజప్ప. ఆ చుట్టూ చేరిన ఖైదీలు వింటున్నారు.

గభుక్కున పెద్దపెద్ద అంగలు వేసుకుని వచ్చాడు ఆ అధికారి. ఆయన్ని చూసి ఖైదీలందరూ నాలుగువేపులా వెళ్ళిపోయారు. కానీ రాజప్ప కదలలేదు. సూటిగా ఆ అధికారి కళ్ళవేపు చూసాడు. ఆయన రాజప్ప చూపుల వేపు చూశాడు.

"ఇది నీ యూనియన్ కాదు... తెల్సిందా" అని అన్నాడాయన.

"తెలుసు"

"అయితే ... ఇక్కడ నువ్వు ఉపన్యాసం ఇవ్వడానికి కాదు వచ్చింది..."

"నాకు తెల్సు"

చురుగ్గా కనుబొమలు పైకెత్తి ఆ ఆఫీసరు రాజప్ప వేపు చూసాడు.

"ఒళ్ళు జాగ్రత్త... వెళ్ళు నీ సెల్‌లోకి .. వెధవ్వేషాలెయ్యక..." వెనక్కి తిరిగి వెళ్ళిపోతున్న వాడు రాజప్ప తిట్టువిని ఆగిపోయాడు.

"ఏట్రా...అన్నావు..."

తిట్టిన తిట్టుని మళ్ళీ అన్నాడు రాజప్ప.

రాజప్ప ఊహించలేదు. ఒక్కసారి ఆ అధికారి పైకెగిరి తన్నాడు. ఆ తాపునకు రాజప్ప అంతదూరం వెళ్ళి మర్రిచెట్టు దగ్గర పడిపోయాడు. మర్రిచెట్టు చప్టా రాజప్పతలకి గట్టిగా గుద్దుకుంది. బుర్రగిర్రుమంది. కదల్లేకపోయాడు.

ఆ తమకంలో ఆ ఆఫీసరు గబగబా వచ్చి రాజప్ప చొక్కా పట్టుకుని

బరబరా లాక్కొని ఆఫీసు వరండా దగ్గరకు తీసుకుని వెళ్ళాడు. అక్కడ లాఠీ విరిగిపోయినట్టుగా కొట్టించి,దాన్ని చూస్తూ ఆనందించి "వెధవ్వేషాలెయ్యక.. తెలిసిందా నీలాగే వేషాలేసిన నీ దోస్త్ ఎవయ్యాడో చూసావు కాదా..." అని అన్నాడు.

"ఇప్పుడు కాదు... ఇవాళకాదు... నిన్ను నీలాంటి వాళ్ళని సమూలంగా నాశనం చేసే కొత్తతరం వస్తుంది. ఈ అన్యాయం... ఈ అక్రమం... ఈ దుర్మార్గం ఎన్నాళ్ళో సాగదు... అది మాత్రం తెల్సుకో..." అంత నీర్సంలోనూ రాజప్ప కార్మిక ఉత్తేజం అతని చేత అనిపించింది.

"వస్తుందిరా... వస్తుంది... కొత్తతరం... మా అక్రమాలు... అన్యాయాలు... అన్నీ పోతాయి... అప్పుడు నిన్ను పిలుస్తారు..." అంటూ ఆ ఆఫీసరు ఒక వెకిలినవ్వు నవ్వి -

"నిన్నిలాక్కాదు..." అని పక్కనున్న కాపలా జవానుని పిల్చి పూల మొక్కల ఫెన్సింగ్ వెనకాతల రాజప్పను వెల్లకిలా పడుకోబెట్టాడు.

ఇంతట్లో ఇంకో వార్డర్‌ని పిలిచి వాడి చెవిలో ఏదో చెప్పాడు. వాడు ఆశ్చర్యంగా చూసి అతని చూపులకు ఝుడిసి బాత్రూం వేపు వెళ్ళాడు. అలా వెళ్ళినవాడు ఓ అయిదు నిమిషాల్లో చేతిలో చిన్నడబ్బాతో వచ్చాడు. ఆ డబ్బాను ఆ ఆఫీసరుకి ఇవ్వబోయాడు. ఆ ఆఫీసరు ఆ వార్డర్ వేపు కోపంగా చూసి 'నువ్వేచెయ్' అన్నట్టుగా కళ్ళతోనే గదమాయించేడు.

నలుగురు జవానులు రాజప్పను నాలుగు వేపులా పట్టుకున్నారు. రాజప్ప గింజుకున్నాడు. ఆ అధికారి రాజప్ప గుండెలమీద కుడికాలు వేసి నిలబడ్డాడు.

ఇంతట్లో మొట్టమొదట డబ్బా పట్టుకున్న వాడివేపు ఆ అధికారి చూడగానే వాడు వెంటనే రాజప్ప నోటిని తెరచి ఆ నోట్లో వాడి మూత్రాన్ని పోశాడు. రాజప్ప పుటుక్కున ఉమ్మేశాడు. మళ్ళీ పోశాడు. మళ్ళీ ఉమ్మేశాడు. మళ్ళీపోశాడు. ఈ సారి ఆ జైలధికారి తన కాలి బూటును గుండెలమీంచి తీసి రాజప్ప నోటిమీద అడ్డం ఉంచి నొక్కేడు.

రాజప్ప విలవిల్లాడేడు.

★ ★ ★

ఒక రోజు చీఫ్ హెడ్‌వార్డర్ విజిట్‌కొచ్చి అందరినీ చూశాడు. ఆడవాళ్ళ గదులను ప్రత్యేకంగా తణికీ చేసాడు. అందులో తొమ్మిదో గదిలో వుండే అమ్మాయి వేపు కళ్ళు చిట్లించి చూసి వార్డర్ చేత తాళం తీయింపించి బయటికి పిల్చాడు...

"నీ పేరేంటి?" అని అడిగాడు.

"కళ్యాణి..." అమాయకంగా జవాబు చెప్పింది.

"రాత్రికి వచ్చీ" అన్నాడు. ఆ అమ్మాయికి మొట్టమొదట ఏం అర్థం కాలేదు. అర్థమయిన తర్వాత ఛీ అని ఆ అమ్మాయి తుపుక్కున వాడి ముఖాన ఉమ్మేసి తిట్టింది.

"నీలాంటిదంటేనే నాకిష్టం.." అని గబుక్కున అందరి ఖైదీల ముందర అతని రసికత్వం బైటపెట్టాడు, సిగ్గులేకుండా ఎడం భుజం మీద చెయ్యివేసి.

ఆ అమ్మాయి రాత్రి వరకూ తిరుగుతూనే వుంది. సరిగ్గా పదకొండు గంటలౌతుంది. మేట్రిన్ వచ్చి ఆ గది తలుపు తీస్తోంది.

"ఈ తలుపు తీశావా తన్నేస్తాను" ఆ అమ్మాయి పౌరుషంగా అంటోంది.

ఇంతట్లోకి ఇద్దరువార్డర్లు వచ్చి కళ్యాణి చెరోపక్క పుచ్చుకుని బయటకు లాక్కెడుతున్నారు. ఆ అమ్మాయి కేకలేస్తోంది.

"అమ్మా అమ్మా రక్షించండి. బాబూ రక్షించండి. లక్ష్మీ, మోతీ, [illegible]లా, ఛమేలీ, అక్కా అక్కా."

గబుక్కున ఆ కేకలకు ఛమేలీకి మెలుకువ వచ్చింది. అప్పటికే గొడవ గొడవగా వుంది. పరిస్థితి అర్థమయింది. ఒక్కసారి గట్టిగా అరుస్తూ అంది -

"అందరికీ వినబడేట్లు గట్టిగా అరవండీ ప్లీజ్... అందరూ అరవండి" ఆవిడ ఉద్రేకాన్ని గ్రహించిన ఆడఖైదీలందరూ నోరుచించుకు అరిచేరు.

ఆ అరుపులకు మగ ఖైదీలు వరుసగా మేల్కొన్నారు.

కళ్యాణిని లాక్కెళుతూ ఆడఖైదీల గదులకూ మగఖైదీల గదులకూ మధ్యనున్న వరండా దగ్గర ఆగిపోయారు. చీకట్లో కళ్ళు చిట్లించుకుని చూసేరు వార్డర్‌లు. ఎదురుగా ఖైరుద్దీన్, అన్సారీ, రాజప్ప, బుచ్చిరాజు, పురుషోత్తం, మరికొంతమంది ఖైదీలు!

ఆ ఇద్దరు వార్డర్లూ ఖైరుద్దీన్ చేతిలో కైమా అయిపోయారు. ఆ గొడవకు మిగతా సెంట్రీలు రణస్థలానికి వచ్చారు. వారు పచ్చడి అయిపోయారు. చాలా మంది చాలామంది.... చాలామంది ఖైదీలు... మగఖైదీలు ఎలా వచ్చేసేరో తెలీదు, తాళాలు ఫడేల్ ఫడేల్ మని పేలిపోయాయి. దొరికిన జవానుని వీళ్ళు వదిలిపెట్టలేదు, దొరికిన ఖైదీని వాళ్ళు వదిలిపెట్టలే[illegible]

గదిలో సింగారించుకుని కూర్చున్న ఛీఫ్ హెడ్ వార్డర్ వార్తవిని గబుక్కు[illegible] వచ్చేడు. గాలిలో తుపాకీలు పేల్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చాడు. కాని అదుపులోకి వచ్చిన పరిస్థితి క్షణంలో అదుపుతప్పిపోయింది.

క్షణాలమీద ఆ వార్త డిప్యూటీ సూపర్నెంట్‌కి వెళ్ళింది. మిగతా అధికారులకి వెళ్ళింది. అప్పుడు డిప్యూటీ సూపర్నెంట్ ఇంట్లోనే వున్నాడు. ఆయన ఎదురుగా డాక్టరు కూడా వున్నాడు. వాళ్ళిద్దరి మధ్యన బ్లూరెబెస్ జిన్ ఫుల్ బాటిలుంది. ఓ బాటిల్తో లెమనైడ్ కూడావుంది. ఓపక్కచికెన్ జాయింట్స్ ఇంకోపక్క రోత్‌మెన్స్ సిగరెట్ ప్యాకెట్స్ వున్నాయి. ఆయన ఆ సమయంలో చాలా హుషారుగాను ఆనందంగాను వున్నాడు. దానిక్కారణం మందుపూర్తయిన తర్వాత ముచ్చటగా నాలుగైదులు దాటని కాలేజీ అమ్మాయితో పడుకోబోతున్నాడు. అందువలన వాళ్ళ మాటలు బూతుల మీదే వున్నాయి. పెంట్ హౌజ్‌లోని జోకులు, రెడ్ సెల్డర్‌లోని జోకులు వేసుకుంటున్నారు.

సరిగ్గా ఆ సమయంలో ఓ వార్డర్ వచ్చి వార్తనందించేడు.

ఆయనకు ఒక్కసారి మూడ్ పాడైపోయింది. నిషాదిగిపోయి కోపం పైకెక్కింది. టేబిల్‌ని ఒక్కసారి తన్నేశాడు. దాని మీద గ్లాసులు సీసాలు మిగతా సరంజామా చిచ్చుబుడ్డీల్లా ఎగిరేయి.

గబుక్కున బైటికొచ్చి జీపెక్కి రెండునిముషాల్లో సెంట్రల్ జైలుకొచ్చాడు. పెద్ద పెద్ద అడుగులేసుకుంటూ యుద్ధ ప్రదేశానికొచ్చాడు. అప్పటికే అక్కడ జైలర్లూ, హెడ్ వార్డరూ మిగతా జైలుని పరిరక్షించే అధికారులూ వున్నారు.

"ఏమిటి,ఏమిటి జరిగింది?"

చీఫ్ హెడ్ వార్డర్ జరిగింది బెరుకు బెరుగ్గా చెప్పాడు. వెంటనే ఆయన దవడ ఫడేల్‌మని పటాసులా పేలింది.

"వాళ్ళు సెల్లోంచి ఎలా బయటకొచ్చారు? ఎలా? ఎలా? మీ సోమరితనం, మీ బద్ధకం కాకపోతే ఏమిటి? తగువుని ముదిర్చిన వాళ్ళెవరు?" కోపంగా అడిగాడు.

హెడ్ వార్డెన్ పేర్లు చెప్పాడు.

"వాళ్ళను తీసుకురండి..."

మేట్రిన్ ఛమేలీని తీసుకొచ్చింది. మిగతా ఖైదీల్ని తీసుకొచ్చారు. వాళ్ళవేపు నిశితంగా చూసి "చదువుకున్నోళ్ళని మీకా మాత్రం గౌరవం ఇస్తున్నాను. తెల్సా... జైలంటే మీకు భయం లేదు. చట్టం అంటే మీకు గౌరవం లేదు. మీరెంత పెద్ద నాయకులైనా... మేధావులైనా... మీ కిక్కడే కాదు... ఈ దేశంలోనే విలువలేదు... తెల్సా... అసలు మీలాంటి తిరుగుబాటుదార్లని

అణిచెయ్యడానికే మాకు చట్టంలో ఇన్ని అధికారాలున్నాయి. మీరు సమాజాన్ని నాశనం చేస్తున్న నక్సలైట్లు. మిమ్మల్ని బతకనివ్వగూడదు... బతకనివ్వగూడదు..."

ఛమేలీతో సహా ఐదుగురిని విసురుగా చెంప దెబ్బలు కొట్టేడు. అన్సారీ గెడ్డాన్ని ముందుకులాగి ముక్కుమీద బలంగా కొట్టేడు. పురుషోత్తం పొట్టలో కొట్టాడు. రాజప్ప దెబ్బమీద లాఠీదెబ్బకొట్టాడు. బుచ్చిరాజు జుత్తుపట్టుకుని ముందుకి లాగి వెనక్కి గోడవేపు విసిరి కొట్టాడు. ఛమేలీ జుత్తు పట్టుకుని వంచి వీపు మీద గుద్దులు గుద్దేడు.

ఇప్పుడు ఆ సమయంలో ఆ పోలీసు అధికారి పిచ్చి పట్టిన వాడిలా వున్నాడు. కొమ్ముల్తో కుమ్మేసినవాడిలా వున్నాడు. అతను తన జుట్టుని రెండు చేతులతో పీక్కుని నానా రకాలుగా తిట్టి అనేక రకాలుగా నానా అసహ్యంగా దుర్మార్గంగా ప్రవర్తించాడు. అతడిలో ఏ మూలా మనిషి పోలికల్లేవు. ఎదురు తిరిగిన వాళ్ళని అడ్డంగా నరికెయ్యగలిగే పోలీసు అధికారిలాగే వున్నాడు.

"గెటౌట్.... ఆలాఫ్‌యు గెటౌట్... టేక్‌దెమ్ ఎ..వే...టేక్ దెమ్ ఎ...వే.." అతడు గట్టిగా అరిచాడు.

వార్డర్లు ముందుకు వచ్చారు. అప్పుడు ఆ సమయంలో రాజప్ప ముందుకి కదిలాడు. దగ్గరకొచ్చిన ఒక వార్డరు చేతిలోని తుపాకీని లాక్కున్నాడు. వెంటనే ట్రిగ్గర్ నొక్కి ఆ తుపాకిని గాల్లో రెండుసార్లు పేల్చి అందరివైపు చూస్తూ...

"రండ్రా...రండ్రా... నా కొడుకుల్లారా...రండ్రా... ఏవడేం చేస్తాడో రండి. మేం మనుషులం కావూ పురుగులం కదూ. మంచి కోసం పాటుపడే ప్రతివాడూ నీలాంటి వెధవల దృష్టిలో గెరిల్లాలే. నువ్వు న్యాయాన్ని కాపాడే వాడివి. ముండల్తోనూ.. మందుల్తో నూ, తార్పుళ్ళతోనూ, లంచాలతోనూ నీ జీవితం పుచ్చిపోయింది.... కుళ్ళిపోయింది.. తోటి మనుషుల్ని చిత్రహింసలు పెట్టే మీరు న్యాయాన్ని రక్షిస్తారా! నెవర్..ఒరేయ్ ఇవాళ నా చేతిలో నీ చావే మూడింది.." అని తుపాకీని ఆ జైలాఫీసరు వేపు గురిచేసి పెట్టాడు.

అప్పుడా సమయంలో ఆ ఆఫీసరుకి కాళ్ళూ చేతులూ చల్లబడిపోయాయి. ఇలా జరుగుతుందని ఊహించలేదు. మిగతా జైలు సిబ్బంది ఏమీ తోచక నిలబడిపోయారు.

ఒకటి

రెండు

మూడు

మూడు నిమిషాలు గడిచాయి.

ఇంతట్లోకి ఎక్కణ్నుంచి వొచ్చారో పదిమంది సెంట్రీలు పరిగెత్తుకుని వచ్చి తుపాకుల్ని గాలిలో పేల్చి ఖైదీలవేపు గురిచేసి నిలబడ్డారు.

రాజప్ప ఆగిపోయాడు.

ట్రిగ్గర్ మీంచి అతని చెయ్యి వెనక్కి వెళ్ళింది. కానీ వెంటనే తుపాకీని అట్నించి వెనక్కి తిప్పి ఆ ఆఫీసరు కడుపులో పొడిచాడు. అడ్డదిడ్డంగా నిలబడిన ఆ చుట్టుపక్కలనున్న జైలు సిబ్బందిని ఆ తుపాకీ కర్రతో కొట్టాడు.

వాళ్ళూ తిరగబడ్డారు. అక్కడి డిప్యూటీ సూపర్నెంట్ సమక్షంలో లాఠీలు స్వేచ్ఛా విహారం, గాల్లో తుపాకీల పేలుళ్ళు, బాష్పవాయు ప్రయోగం జరిగాయి. కొంతమంది జవానులు ఎక్కువ మంది ఖైదీలు గాయపడ్డారు.

గంట తర్వాత నిశ్శబ్దం మధ్య జైలు వల్లకాడులా వుంది. దెబ్బతగిలిన వాళ్ళకు డాక్టరు చికిత్స చేసి వెళ్ళాడు. తర్వాత జైలుని సూపరిండెంట్ విజిట్ చేసారు.

ఆ మర్నాడు. ఒక ఏడుగురు పై అధికారులు వచ్చారు. వాళ్ళు తమ తోడేళ్ళ చూపుల్తోను కొండచిలువ కళ్ళతోను ఖైదీల్ని శల్య పరీక్షలు చేసాక ప్రత్యేకంగా ఛమేలి, రాజప్ప, ఖైరుద్దీన్ అన్సారి, పురుషోత్తం, బుచ్చిరాజులను చూసి వెళ్ళి ఆఫీసురూంలో సమావేశమయ్యారు. ఆ అధికారులతో పాటు జైలు సూపరింటెండెంట్, డిప్యూటీ సూపరింటెండెంట్, సీనియర్ జైలర్, వార్డర్లు, చీఫ్ హెడ్ వార్డర్లు వున్నారు.

ఖైదీలకు జైలంటే భయం లేదు. జైలు అధికారులంటే గౌరవం లేదు. చట్టం అంటే గౌరవం లేదు. దానికి ఇలాంటి వాళ్ళే కారణం. వాళ్ళని అణిచెయ్యాలి. మిగతా ఖైదీలు తిరగబడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఆ రోజు మధ్యాహ్నం సూపరింటెండంట్ మళ్ళీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి జైల్లో క్రమశిక్షణ మీద, అధికారుల విధులమీద అరగంట ఉపన్యసించి ఇలాంటివి ఇకముందు జరక్కుండా అప్రమత్తతతో ప్రతీ ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని చెప్పారు.

మర్నాడు జైలులో వాతావరణం బాగుంది. ఖైదీలందరూ ఆనందంగా వున్నారు. దానిక్కారణం ఏ అధికారీ ఆ రోజు వాళ్ళని చూడడానికి రాలేదు. మధ్యాహ్నం భోజనం అయ్యాక వాళ్ళు నలుగురూ రావిచెట్టుకింద కూర్చొని చాలాసేపు మాట్లాడుకున్నారు.

అప్పుడు అన్సారీ భార్యను తల్చుకుని బాధపడ్డాడు. పురుషోత్తం జీవితాన్ని తల్చుకొని బాధపడ్డాడు. వాళ్ళు చాలా సేపు బాధపడి చివరికి పరిష్కారంకాని జీవితానికి పరిష్కారాన్ని నిశ్చయించుకున్నారు.

ఏవిటి?

ఎలాగా?

కాని-

ఆ వేళ-

జైలులో వాతావరణం ప్రశాంతంగా ఉంది. చెట్ల గుబురుల్లోంచి తొంగిచూసే పువ్వులు చక్కగా పసిపిల్లల్లాగా వున్నాయి.

రాత్రి-

ఎనిమిది గంటలకి భోజనాలయ్యాయి.

ఆ వేళ ప్రత్యేకంగా రాజప్పని, పురుషోత్తంని ఒక గదిలోకీ; అన్సారీ, బుచ్చిరాజుని ఒక గదిలోకీ మార్చేరు.

పురుషోత్తం ఫాలోమి పుస్తకాన్ని చదవడం పూర్తిచేశాడు. రాజప్ప ఆ రాత్రి స్వేచ్ఛగా గొంతెత్తి పాటలు పాడుకున్నాడు. అన్సారీ "అంబాసిడర్ ఆఫ్ గుడ్‌విల్" పూర్తి చేశాడు. బుచ్చిరాజు గోడమీద మసిబొగ్గుతో ఏవో బొమ్మలేస్తూ కూర్చున్నాడు.

అవతల ఆడ ఖైదీల గదుల్లో చివర గదిలో కూర్చున్న ఛమేలి ఇనుప కటకటాల్లోంచి కనబడే నల్లటి ఆకాశాన్నీ, చుక్కల్నీ చూస్తూ కూర్చుంది.

చెట్ల మీంచి వచ్చే గాలి మెల్లగానూ, మెత్తగానూ వుంది. ఆ మెత్తని గాలి నిద్రని మత్తుగా వంటిమీదకు తెస్తోంది. సరిగ్గా ఆ సమయంలో అక్కడ చీకటి చిక్కగా వుంది. దూరంగా కోవెల్లో గంటలు ఎవరో మోగిస్తున్నారో, గాలికి వూగుతున్నాయో గాని, ఆ శబ్దం గాలిలో వూగుతూ జోగుతోంది.

సరిగ్గా అప్పుడు-

డిప్యూటీ సూపరింటెండెంట్, సీనియర్ జైలర్, హెడ్ వార్డన్ మరికొంత మంది జైలు సిబ్బంది వచ్చి వరండా మీద నిలబడ్డారు. డిప్యూటీ సూపరింటెండెంట్ చూపులు ఆ చివర గదుల్లోకి వెళ్ళాయి.

"వెళ్ళండి ఆఫీసర్ ఆజ్ఞాపించగానే నలుగురు వార్డర్లు చకచకా ఆ చివర గదుల దగ్గరి కెళ్ళి తాళాలు తీసారు.

ఆ చప్పుడుకి అక్కడ నిద్రపోతున్న ఖైదీలకు మెలకువ వచ్చింది.

"ఎవరు?"

దానికి సమాధానం లేదు.

వరండా మీద లైటు వెలిగింది.

ఆ సమయంలో ఆ జవానులెందుకు అక్కడకొచ్చారో అర్థం కాలేదు.

"బైటకు రండి" హెడ్ వార్డర్ ఆజ్ఞతో వాళ్ళు నలుగురూ బైటకు వచ్చారు.

"రండి"

వార్డర్ల వెనక వాళ్ళు నలుగురూ వరండా వరకు వచ్చారు. అక్కడ చీకట్లో నిల్చుని వున్న డిప్యూటీ సూపరింటెండెంట్ తుప్పలచాటున తోడేలులా వున్నాడు.

"వీళ్ళని కొట్టుగదికి తీసుకువెళ్ళండి" ఆజ్ఞాపించాడు.

"దాన్ని కూడా తీసుకురండి.." అధికారి మాటతో మేట్రిన్ గబగబా వెళ్ళి అయిదు నిమిషాల్లో చమేలి ముఖర్జీని తీసుకువచ్చింది.

కొట్టుగదిలో వాళ్లు ఐదుగురూ ఓ కర్రబల్లమీద కూర్చున్నారు. వాళ్ళ చేతులకి బేడీలు తగిలించేరు. అప్పుడా జైలు అధికారి 'మీరు వెళ్ళండి' అని సిబ్బందిని పంపించేశాడు. హెడ్ వార్డర్‌ని మాత్రం వుండమన్నాడు. హెడ్ వార్డర్ చేతిలో బ్యాటరీ లైటు వుంది. దాన్ని తన చేతిలోకి తీసుకుని ఆ జైలధికారి ఖైదీల వేపు "ఫోకస్" చేశాడు.

వాళ్ళు ఐదుగురుకి ఏవీ అర్థం కావడం లేదు. ఏమిటి జరుగుతోంది. ఏమిటి? తిరగబడినందుకు శిక్షిస్తారా...లేకపోతే ఇంకో చోటికి పంపిస్తారా... అయినా ఈ అర్ధరాత్రేమిటి?.

వాళ్ళు నెమ్మదిగా ఒకళ్ళనొకళ్ళు అదే ప్రశ్న వేసుకున్నారు. కాని ఆ ప్రశ్నకు సమాధానం ఎవరూ చెప్పలేకపోయారు.

రెండు నిమిషాలు గడిచాయి.

అంతవరకు గదిబైట నిలబడ్డ ఆ అధికారి గదిలోకి వచ్చాడు. ఒక్కొక్కరి మొఖం మీద బ్యాటరీ లైటు వేశాడు. అప్పుడు ఐదుగురు మనసుల్లో ఏ ఆలోచనా లేదు. కాని వాళ్ళు ఐదుగురు మనుషులు కాబట్టి మొదటిసారిగా

అతనికి జంకుపుట్టింది. అందుకు గుర్తుగా బ్యాటరీ లైటు వెలుగులో చిరుచెమట మెరిసింది.

అప్పుడా జైలు అధికారి వాళ్ళనుద్దేశించి యిలా అన్నాడు.

"మీరు రోడ్డుమీద కొట్టుకున్నారనుకోండి... నేను పట్టించుకోను.. లూఠీలు చేశారనుకోండి... బ్లాక్‌మెయిల్ చేశారనుకోండి, స్మగ్లింగ్‌చేశారనుకోండి... పోనీ యెవర్నయినా కిడ్నాప్ చేసి ఎత్తుకుపోయారనుకోండి..రేప్ చేశారనుకోండి...వాటికి సరైన కారణాలుంటే నేను మిమ్మల్ని సానుభూతితో చూడగలను... కాని మీరు జవాన్ల మీద తిరగబడినపుడు నేనూరుకున్నాను. అల్లర్లను సృష్టించినపుడు మీ గురించి ఆలోచించాను. కాని మీక్కాని వ్యవహారంలో జోక్యం చేసుకున్నారు. జైలు అధికారుల మీద తిరగబడ్డారు. అప్పుడు మీరెవరో నాకర్థమయింది.... మిమ్మల్ని మనుషులుగా చూడకూడదని; జాలి, దయ మీ విషయంలో పనికిరావని అర్థమైంది.

దీన్ని ఎవరూ క్షమించరు. ఈ చట్టం, ఈ న్యాయం, ప్రజల్ని రక్షించడానికి ఏర్పడ్డాయి. కానీ మీరు చట్టం మీద, న్యాయస్థానం మీద తిరగబడ్డారు. మార్పు తెచ్చుకుని మంచి మనుషులుగా వెళ్ళాల్సిన మీరు జైల్లో అలజడిని సృష్టించారు. అడుగడుగున ఆటంకం కలిగించారు, మేం ప్రజల జీవితాన్ని పరిరక్షించలేకపోవడానికి, సమాజంలో భద్రత లోపించడానికి మీలాంటి వాళ్ళే కారణం.

మామూలుగా హాయిగా బతికే అలగాజనులు మీ పాటలకు ఉత్తేజం పొంది, మీ మాటలు నిజమని నమ్మి, పోలీసుల మీద తిరుగుబాటు చేస్తున్నారు. ఆలోచన లేని వాళ్ళకి ఆలోచన కలిగిస్తున్నారు. నా దృష్టిలో మీరే నిజంగా ద్రోహులు. సంఘానికి మీరే చీడపురుగులు. అలాంటి చీడపురుగుల్ని నేలరాసేందుకే ప్రభుత్వం మాకిన్ని అధికారాలిచ్చింది.

మీకు చట్టం అంటే గౌరవం లేదు. అధికారులంటే లక్ష్యం లేదు. మీకు మేము గడ్డిపోచతో సమానం. నిన్న మీ వలన మా అధికారుల ముందర నేను తలవంచుకోవాల్సి వచ్చింది. దానిక్కారణం ఇప్పటి వరకు మిమ్మల్ని మర్యాదగా చూడ్డమే. ఆ మర్యాదను మీరు నిలబెట్టుకోలేదు.

పైగా మిమ్మల్ని విడుదల చేయాలని బైటనుంచి మెమొరాండాలు, కరపత్రాలు. అన్ని వేపుల ఒక పథకం ప్రకారం మీరు సృష్టిస్తున్న అలజడిని

నేను ఎదుర్కోవడానికి నిశ్చయించుకున్నాను. నేనంటే ఏమిటో మీకు చూపిస్తాను.''

ఆ ఆఫీసర్ మెల్లగా ప్రారంభించి రానురాను కోపంతో అరవడం మొదలు పెట్టాడు. అప్పుడా ఆఫీసరు ఏమిటంటున్నాడో ఆయనకే తెలియదు. పచ్చిభూతులు తిడుతున్నాడు.

అప్పుడు ఆ మాటలు, ఆ తిట్లు వినలేని అన్సారీ -

"ఏం తప్పు చేశామని... మాకు జైలు... మమ్మల్నెందుకు కోర్టుకి ప్రొసీడ్ చేయకుండా వుంచారు. లాయర్నెందుకు ఏర్పాటు చేయలేదు. నిజానికి మేం కాదు. ప్రమాదకరమైన వ్యక్తులం. నువ్వు. నీలాంటి పదవి ముసుగు వేసుకుని పైసాకూడా పంచుకునే మీ పోలీసులే ఈ సమాజానికి ద్రోహులు, మీరే గూండాలు... మీరే...''

ఇంకేదో అనబోయాడు. అప్పుడా ఆఫీసర్ కోపంతో వూగిపోయి అన్సారీ దగ్గరకు గబగబా వెళ్ళి అతనిజుత్తు పట్టుకుని గోడకేసి కొట్టాడు. ఆ దెబ్బ అన్సారీ తలకి బలంగా తగిలింది.

అప్పుడు ఆ ఖైదీలు ఒక్కసారి ఒకరివేపు ఒకరు చూసుకున్నారు. క్షణంలో తమ సంకెళ్ళు వేసిన చేతులెత్తి ఆ ఆఫీసరు తలమీద బలంగా మోదారు. ఆ ఆఫీసర్ భయంకరంగా కేకవేశాడు.

"చచ్చాడు వెధవ..'' రాజప్ప కసిగా అన్నాడు. కానీ ఆ ఆఫీసర్ క్రింద పడిపోయినవాడు గబుక్కున లేచి ఆ కొట్టుగది లైటు వేశాడు. ఆ లైటు వెలుగులో ఆ ఆఫీసర్ వేపు చూశారు వాళ్ళు అయిదుగురూ.

అప్పుడా ఆఫీసర్ నెత్తిమీద నుంచి కారుతున్న రక్తం ముఖం మీంచి జారి అతని ఖాకీ బట్టలమీద పడుతోంది. అతని జుత్తు రేగిపోయింది. అతని కళ్ళలో కోపం, అతని మనసులో ఉద్రేకం వలన అతని నరాలు పొంగాయి. ఆ సమయంలో ఆ అధికారి మనిషిలా లేడు. మృగంలా కూడా లేడు.

"ఒరేయ్, ఒరేయ్ ఇప్పుడు చూపిస్తాను నా తడాఖా. మిమ్మల్ని నాశనం చెయ్యకపోతే నా పేరు..., నా పేరే కాదు... మీకు జీవితాంతం గుర్తుండేలా చేస్తాను. ఎవడాపుతాడో నేను చూస్తాను. ఏ ప్రభుత్వం, ఏ నాయకులు, ఏ పత్రికలు, ఏ మేధావులు అడ్డం వస్తారో నేను చూస్తాను'' అంటూ గట్టిగా కేకేసి హెడ్ వార్డర్‌ని పిలిచాడు.

అంతవరకు గది పక్కన నిలబడ్డ హెడ్ వార్డర్ గదిలోకి వచ్చాడు.

అప్పుడు అక్కడి వాతావరణం చూసి ఆ హెడ్ వార్డర్ భయపడ్డాడు. ఈ పదినిమిషాల్లో అక్కడ విలయం చెలరేగింది.

పురుషోత్తం కళ్ళద్దాలు కిందపడి అద్దాలు పగిలిపోయాయి. అతని మోచేతుల్నుండి రక్తం కారుతోంది. రాజప్ప నుదురు తోలు వూ వేలాడుతోంది. అన్సారీ ముక్కు బద్దలైపోయి నెత్తుటేరు అయిపోయింది బుచ్చిరాజు చొక్కా చిరిగిపోయి అతని గుండెల మీద పోలీసుబూట ముద్రలు, చిమ్ముతున్న రక్తం మరకలున్నాయి.

హెడ్ వార్డర్ ఆఫీసర్ వేపు భయంగా చూశాడు.

ఆఫీసర్ చేతిలో ఇనుప గొలుసుంది. ఆ గొలుసును అతడు మడతబెట్టి పట్టుకు నిలబడ్డాడు. ఆ గొలుసు రాపిడికి అతని కుడిచెయ్యి చీరుకుని రక్తం కారుతోంది.

ఆ ఆఫీసర్ హెడ్‌వార్డర్ వేపు ఒకసారి చూసి అతని చూపుల్ని కిందకు మరల్చేడు. ఆ హెడ్‌వార్డర్ చేతిలో సీసాని చూసి అతను ఒక్కసారి చాలా ఆనందంగా తలపూపి, ముందుకి వచ్చిన తనజుత్తుని వెనక్కి తోసుకుని ఆ సీసాని అందుకున్నాడు.

గబుక్కున మూత తెరిచేడు.

ఆ కొట్టు గదిలో నాలుగు వేపులా పడిపోయిన ఆ ఐదుగురి ఖైదీల కళ్ళల్లోనూ ఆ సమయంలో భయం పాదరసంలా పాకింది. ఐదుగురూ ఒక్కసారి ఆ ఆఫీసర్ వేపు చూశారు.

"ఒరేయ్"

"కుత్తే"

"బాస్టర్డ్"

"వెధవా"

"లత్తుకోర్"

ఆ ఖైదీలు లేవబోయారు.

ఒకటి, రెండు, మూడు

మూడే మూడు క్షణాలు

అబ్బా... అమ్మా... అమ్మా..

అమ్మా... అమ్మా... అమ్మా.

అమ్మ... అమ్మ...

కేకలు, అరుపులు, హాహాకారాలు.

ఏ అమ్మా వాళ్ళ పిలుపుల్ని వినలేదు. వాళ్ళ బాధల్ని చూడలేదు. వాళ్ళ కడుపులోని పేగులు ఉంగలు చుట్టుకుపోయాయి. వాళ్ళ చేతులు నిస్సహాయంగా ముందుకి కదిలాయి. వాళ్ళ కాళ్ళు భయం వల్ల కదలలేక పోయాయి.

వాళ్ళ...

కళ్ళు..

కళ్ళు...

ఆ కళ్ళు ఒక్కసారి బొబ్బలెక్కాయి. అంతంత నీటి బుడగల్లా ఆ కళ్ళ మీద తెల్లటి బొబ్బలు! కళ్ళ మీద సున్నితమైన పొర కనురెప్పలు కల్సి ఉండిపోయాయి. వాళ్ళు కుంపటి మీద కాల్తున్న కోడిపిల్లల్లాగా అరిచేరు. ఆ అరుపులు ఆ జైలు రాతి గోడలు దాటి బైటకు వచ్చాయో లేదో తెలియదు. ఆ జైలు అధికారి ఆసీసా నిండుగా వున్న పవర్‌ఫుల్ ఆసిడ్‌ని నిర్దాక్షిణ్యంగా అమానుషంగా భయంకరంగా అన్యాయంగా అధికారంగా ఆ ఖైదీలకళ్ళల్లోకి విసురుతూ... విసురుతూ.. విసురుతూ... విసురుతూ...

*ఆంధ్రజ్యోతి వీక్లీ దీపావళి సంచిక - 1989*

*